క్లుప్తంగా

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు పుష్పలత

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో ముత్యాలమ్మ గుడి వద్ద పంచాయతీ నిధులతో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత శంకుస్థాపన చేశారు. వార్డు సభ్యులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

చింతపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయ భారతి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్‌వీ నగర్ పీహెచ్‌సీ వైద్యుల సహకారంతో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో విద్యార్థులకు కంటి, గుండె, రక్తహీనత వంటి పలు రకాల పరీక్షలు చేశారు. విద్యార్థులకు ఆరోగ్యం పట్ల పలు సలహాలు, సూచనలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ రాజేంద్ర ప్రశాంత్ చౌదరీ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏఎన్ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి జ్ఞానేశ్వరీ

అనంతగిరి: వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని, అనంతగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి జ్ఞానేశ్వరీ అన్నారు. మండలంలోని కొత్తూరు కేజీబీవీ పాఠశాలలో ఆమె శుక్రవారం విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థినిలకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలని, భోజనం చేసేముందు చేతులు శుభ్రంగా కడుగుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత లేకపోతే వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



రవిరింతాడలో బోర్‌వెల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ బాలయ్య

చింతపల్లిరూరల్: మండలంలో కొమ్మంగి పంచాయతీ రవిరింతాడ గ్రామంలో జెడ్పీ నిధులతో బోర్‌వెల్ నిర్మాణానికి శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ మేరకు జెడ్పీ నిధులతో మండలంలో పలు చోట్ల ఎనిమిది బోర్లు మంజూరు చేశామన్నారు. వీటి పనులను త్వరగా పూర్తి చేసి గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. మండల కన్వీనర్ గణబాబు, వార్డు సభ్యులు మరియమ్మ, చిలకమ్మ, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

అనకాపల్లి: నిత్యం ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని ధ్యాన ఆశ్రమం శ్రీగీజా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వ్యవస్థాపక ప్రతినిధి నరేంద్ర ముదల్కర్ అన్నారు. స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం ధ్యానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడితో మనుషుల జీవనశైలిలో మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. కోవిడ్ తరువాత ప్రతి వ్యక్తి వ్యాయామం, ధ్యానం, యోగాపై ఆసక్తి పెంచుకున్నట్లు పేర్కొన్నారు. ఒత్తిడితో శరీరం పలు వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయని తెలిపారు.

- వ్యవసాయ పనుల్లో గిరిరైతులు నిమగ్నం
- విస్తారంగా చోడి, వేరుశనగ నాట్లు
- వరి నారుమడులు సిద్ధం

జోరుగా సాగు



బి. గంగగుడ్డిలో చోడి నాట్లు వేస్తున్న గిరిరైతులు



మాలివలసలో వేరుశెనగ నాట్లుపై వివరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

అరకులోయటౌన్: గిరి రైతులు ఖరీఫ్ వ్యవసాయ సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో క్షణం తీరిక లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా పనుల్లో విలీనమవుతున్నారు. మెట్ట భూముల్లో చోడి(రాగులు), వేరుశనగ నాట్లు వేసుకుంటూ, మరో పక్క వరి సాగుకు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. అంతే కాకుండా వాణిజ్య పంటలైన అల్లం, పసుపు, కూరగాయల సాగు పనులు కూడా చేపడుతున్నారు. ముఖ్యంగా మండలంలోని చినలబుడు, పెదలబుడు, పద్మాపురం, మాడగడ, సుంకరమెట్ట, బస్కీ, తదితర పంచాయతీల్లో కూరగాయల సాగు పనులు జోరుగా జరుగుతున్నాయి. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు చేస్తూ, మధ్యాహ్న భోజన అనంతరం వ్యవసాయ పనుల్లో గడుపుతున్నారు.

వరి సాగుకు సన్నద్ధం

అరకులోయ మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో వరి సాగుకు అవసరమైన వరి నారు మడులు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ మేరకు ఇప్పటికే భూసార పరీక్షలు దుక్కి పనులు చేపట్టారు. ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలతో పొలాల్లో నీరు చేరింది. మన్యంలో ప్రస్తుత వాతావరణం వరి సాగుకు అనుకూలించడంతో గిరిజన రైతులందరూ ఖరీఫ్ వరి సాగుకు సన్నద్ధమయ్యారు. ఇదిలా ఉండగా చోడి(రాగులు)–9,200 ఎకరాల్లో, వేరుశనగ–4,800 ఎకరాల్లో, అన్ని రకాల కూరగాయలు వందలాది ఎకరాల్లో సాగు చేపట్టారు. అల్లం, పసుపు పంట ప్రతీ ఇంట అర ఎకరం నుంచి ఒక ఎకరం వరకు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వరి పంటతో పాటు మెట్టు పంటలు, వాణిజ్య, కూరగాయల సాగు ఆశాజనకంగా ఉండవచ్చని రైతులు ఆశభావం వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయలు, వాణిజ్య పంటల సాగు



మన్యంలో వ్యవసాయ పనులకు వాతావరణం బాగుంది. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో సమృద్ధిగా నీరు చేరింది. కూరగాయలు, వాణిజ్య పంటలతో పాటు వరి పనులు జోరందుకున్నాయి. పంటల దిగుబడి బాగుంటాయని ఆశపడుతున్నాం. గిట్టుబాటు ధరలు వస్తాయని భావిస్తున్నాం.

– కె.గుప్త, రైతు, ప్రధానిపుట్, పద్మాపురం పంచాయతీ, అరకులోయ

అనుకూలంగా వాతావరణం



ఈ ఏడాది రైతులు ఎక్కువగా కూరగాయల సాగు చేపడుతున్నారు. వాణిజ్య పంటలతో పాటు మెట్టు పంటలైన రాగులు, వేరుశనగ సైతం ఇప్పటి వరకు ఆశించిన దాని కంటే పంట మొలక దశ బాగుంది. విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో సకాలంలో పంటలు వేసుకున్నారు. సాగుకు అనుకూలంగా వాతావరణం ఉంది.

– ఫణిరాజువర్మ, ఏఓ, అరకులోయ మండలం

సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గుమ్మకోట సర్పంచ్ అప్పారావు తదితరులు

అనంతగిరి: మండలంలోని గుమ్మకోట పంచాయతీలో నెలకొన్న ప్రధానమైన సమస్యలపై కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్‌కు స్పందనలో కలిసి వినతులు అందజేసినట్టు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అప్పారావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలిపాడు బురదగెడ్డ పాఠశాలలు భవనాలు, చిప్పపల్లి నుంచి కొత్తపేట, పందిరివలస నుంచి గరుగుబిల్లి వరకు తారురోడ్లు నిర్మించాలని, గుమ్మకోట మీదుగా అరకులోయ మండలం లోతేరు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, అలాగే లోఓల్టేజ్ కారణంగా దుండవలస, లోగుమ్మకోట, దబ్బలపాడులో తాగునీటి సమస్యతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. దీనిపై అధికారులు స్పందించి, గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ముందస్తు చర్యలకు డిమాండ్



పెదార్కూరులో నిర్వహిస్తున్న గ్రామసభ

కూనవరం: జూలై, ఆగస్టు మాసాల్లో గోదావరి వరదలు అకస్మికంగా వచ్చే ప్రమాదం ఉందని, అధికార యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేయాలని, ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని, పెదార్కూరు, కూటూరు సర్పంచ్‌లు నాగమణి, బొగ్గా వెంకమ్మ కోరారు. పెదార్కూరు, కూటూరు పంచాయతీ శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బఫర్‌స్టాక్ బియ్యం, నిత్యావసర సరుకులు, కిరోసిన్, కూరగాయలు అందుబాటులో ఉంచాలన్నారు. పునరావాస కేంద్రాల్లో సోలార్ దీపాలు ఏర్పాటు చేయాలని, బండారుగూడెం, రేపాక, పెదార్కూలో మంచినీటి బోర్లు, టార్పాలిన్లు ఏర్పాటు చేయాలన్నారు. బొర్రాయిగూడెం, లింగాపురం, అభిచర్ల, కూటూరు, రేగులపాడు గ్రామాలకు ప్రత్యేక బోటు ఏర్పాటు చేయాలని సూచించారు. వరదబాధితులకు మూడు నెలలు పనులు ఉండవు కాబట్టి ఉపాధి గ్రాసంగా కుటుంబానికి రూ. 5000 చొప్పున ఆర్థిక సహాయం అందించాలన్నారు. వీఆర్ ఓ రాజారావు, స్థానిక ఎంపీటీసీ ధర్ముల అమ్మాజి, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీరు, పాల్గొన్నారు.

చెక్‌డ్యాం నిర్మించాలి



సరియాపల్లిలో ధ్వంసమైన చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న జిల్లా గిరిజన సమాఖ్య నేతలు

పెదబయలు: మండలంలోని గోమంగి పంచాయతీలోని పలు గ్రామాలకు సాగు నీరు అందక అవస్థలు పడుతున్నారని చెక్ డ్యాంలు నిర్మించి గిరిజన రైతులకు సాగునీరు అందించాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జె.సునీల్ డిమాండ్ చేశారు. మండలంలోని గోమంగి పంచాయతీ సరియాపల్లి గ్రామ సమీపంలో ధ్వంసమైన చెక్ డ్యాంను వారు శుక్రవారం పరిశీలించారు. 2014లోని హుద్ హుద్ తుపానులో చెక్‌డ్యాం ధ్వంసమైందని, అప్పటి నుంచి నేటి వరకు ఎలాంటి మరమ్మతు పనులు, నిర్మాణాలు చేయలేదన్నారు. దీంతో వరి పంట పొలాలకు సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంతో చెక్ డ్యాం ఉన్నప్పుడు రెండు పంటలు పండే వరి పొలాలు వర్షాధారంపై రైతులు ఆధారపడాల్సి వస్తుందన్నారు. చెక్‌డ్యాం లేక గోమంగి, ఊబలగరువు, కుమ్మరివీధి, డెంగ్రాయిపుట్టు, గుల్లేలు పంచాయతీ మత్రిపుట్టు, చిన్నగుల్లేలు గ్రామాల్లో సుమారు 500 ఎకరాలకు సాగు నీరు అందక రైతులు నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి గిరిజన రైతులకు సాగునీరు అందేలా చెక్ డ్యాం నిర్మించాలని కోరారు. ఉప సర్పంచ్ కె.మత్స్యకొండబాబు, మహేష్, బొంజుబాబు, దామోదరం, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

వై.రామవరం: వై.రామవరం నుంచి అడ్డతీగల వెళ్లే ప్రధాన రహదారిలో శుక్రవారం సాయంత్రం ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా అవుతున్నట్టు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహన రికార్డులు సక్రమంగా లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. వాహనాల్లో సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. అపరిచితులు, అనుమానస్పద వ్యక్తులపై నిఘా విధించారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



బుంగాపుట్టు గ్రామస్తులతో మాట్లాడుతున్న సర్పంచ్ త్రినాథ్

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి బరడ, లక్ష్మీపురం పంచాయతీ కేంద్రాల మీదుగా బుంగాపుట్టు పంచాయతీ కేంద్రానికి ఆర్టీసీ బస్సు సర్వీసు నడపాలని లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. బుంగాపుట్టు గిరిజనులతో సర్పంచ్ త్రినాథ్ గురువారం సమావేశం నిర్వహించారు. రవాణా కష్టాలపై చర్చించారు. బస్సు సౌకర్యం కల్పించాలని తీర్మానం చేశారు. ఈ మేరకు పాడేరులో నిర్వహించే మీకోసం కార్యక్రమంలో బస్సు సర్వీసు నడపాలని వినతి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ బుంగాపుట్టు, లక్ష్మీపురం, బరడ పంచాయతీలకు చెందిన 60 గ్రామాలకు పైగా గిరిజనులు ప్రయాణ ఇబ్బందులు పడుతున్నారని, పంచాయతీ కేంద్రాలకు తారురోడ్డు ఉన్న ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసును నడపాకపోవడం అన్యాయం అని, తక్షణమే ఆర్టీసీ బస్సును నడపాలని ఆయన కోరారు. దీనిపై సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారని ఆయన చెప్పారు.

జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు

ఏయూక్యాంపస్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని జనాభా అధ్యయన కేంద్రం వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య బి.ముని స్వామి తెలిపారు. ఈ నెల 8వ తేదీన ఉదయం 10 గంటలకు స్టాటస్టిక్స్ విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో 'జనాభా పోకడలు– సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగా పురోగతి' అంశంపై పోటీలు జరుపుతామని. కళాశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆసక్తి కలిగిన వారు 9849102241 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రైతులకు మొక్కల పంపిణీ



రైతులకు మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ వరహాలమ్మ, ఎంపీడీవో విగ్గిన్స్

పెదబయలు: మండలంలోని గిరిజన రైతులకు ఉచితంగా సిల్వర్ ఓక్ మొక్కలు పంపిణీ చేసినట్టు ఎంపీపీ బొండా వరహాలమ్మ, ఎంపీడీవో వి.విగ్గిన్స్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సీతగుంట పంచాయతీ పరిధిలోని ఏడుగురు రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. ఎంపీడీవో విగ్గిన్స్ మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ బొండా వరహాలమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన మొక్కలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిల్వర్ ఓక్ మొక్కలతో పాటుగా 20 రకాల మొక్కలు అందించినట్టు చెప్పారు. మండలంలోని మొదటి దఫాగా ఏడుగురికి అందించామని, 300 మంది రైతులు మొక్కల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారికి 10 రోజుల వ్యవధిలో అందిస్తామన్నారు. ఉచిత మొక్కలు అవసరమైన వారు తమ పట్టా, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, ఉపాధి కార్డు జెరాక్స్ కాపీలతో సంప్రదిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేసి మొక్కలు అందించినట్టు తెలిపారు. మూడేళ్ల తరువాత సిల్వర్ ఓక్ కింద కాఫీ, మిరియాలు నాటు కోవడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. రైతులు మొక్కల పెంపకంపై ఆశక్తిని పెంచుకోవాలన్నారు. ఏవో ఎల్.పూర్ణయ్య, ఉపాధి ఏపీవో చిన అప్పలనాయుడు, సర్పంచ్ పలాసి మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు కిముంకరి బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ తప్పనిసరి





పశువైద్యాధికారులు అప్పన్న బాబు, సుజనకుమారి

గంగవరం: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేయనున్నట్టు నెల్లిపూడి గ్రామీణ పశు వైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారి పి.అప్పన్నబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు సుమారు 200 రకాలకు పైగా వ్యాధులు సోకే అవకాశాలున్నట్టు శాస్త్రవేత్తలు పలు పరిశోధనల్లో వెల్లడించారని చెప్పారు. ఇందులో భాగంగా పందుల ద్వారా మెదడువాపు వ్యాధి, కుక్కల ద్వారా రేబిస్, గొర్రెలు, మేకల ద్వారా ఆంత్రాక్స్ వ్యాధి సోకే ప్రమాదాలున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో రేబిస్ సోకిన కుక్కను ముట్టుకున్నా, దగ్గరకు చేర్చుకున్నా వ్యాధి అంటుకుంటుందన్నారు. రేబిస్ వ్యాధి ప్రాణాంతకమన్నారు. రేబిస్ సోకిన కుక్క కరిస్తే ప్రాణానికే ముప్పు అని పేర్కొన్నారు. కుక్కలకు ఎటువంటి వ్యాధులు సోకకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు వేస్తున్న వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్

జి.మాడుగుల: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక ప్రభుత్వ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నట్టు పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.పి. సుజనకుమారి తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. పెంపుడు కుక్కల యజమానులు ఇటీవల జరుగుతున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకొని తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఆమె సూచించారు.

బాలికలకు సికెల్‌సెల్ అనీమియా పరీక్షలు



తురకలవలస ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సత్యశ్రీ, సిబ్బంది

పెదబయలు: మండలంలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సికెల్‌సెల్ అనీమియా పరీక్షలు చేస్తున్నట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యశ్రీ అన్నారు. మండలంలోని తురకలవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు హిమోగ్లోబిన్, సికెల్ సెల్ అనీమియాతో పాటు మలేరియా, టైఫాయిడ్, ఇతర వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేశామన్నారు. రక్తహీనత వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. దోమతెరలు వినియోగించాలని, కాచి చల్లార్చిన నీటిని వినియోగించాలని సూచించారు. హెచ్ఎం పి.గంగాభవాని, ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



సదస్సుల్లో పాల్గొన్న ఎస్‌డీఐ సీఈఓ, సెక్రటరీ ఇంథియాజ్ అర్షద్

విశాఖ సిటీ: ఏపీ చాంబర్స్–స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో విశాఖలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో ×స్కిల్లింగ్/అప్‌స్కిల్లింగ్–ఎంప్లాయిబిలిటీ×అనే అంశంపై సదస్సు జరిగింది. పరిశ్రమల సహకారం ద్వారా నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడం, కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాముఖ్యం, పారిశ్రామిక శిక్షణల విలీనం, సానుకూల ప్రవర్తనను పెంపొందించడం తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌డీఐ సీఈవో, సెక్రటరీ ఇంతియాజ్ అర్షద్ ఇన్‌స్టిట్యూట్‌లో అందిస్తున్న వివిధ సౌకర్యాలు, శిక్షణా కార్యక్రమాలను వివరించారు. సభ్యుల నుంచి సూచనలను ఆహ్వానించారు. ఈసీ సభ్యుడు సుధీర్ ములగాడ, మహిళా విభాగం ఛైర్‌పర్సన్ డాక్టర్ గీతా శ్రీకాంత్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లోని శిక్షణ కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులతో సంభాషించారు. వారు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పెట్రోలియం ఇండస్ట్రీ ప్రతినిధి బృందాన్ని కూడా కలిశారు. అనంతరం ఐటాప్ అధ్యక్షురాలు, పాత్ర బీపీవో ఎండీ ఎం.లక్ష్మి విలువైన సూచనలందించారు. ఎస్‌డీఐ అసిస్టెంట్ మేనేజర్ ఎం.హరిప్రియ వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో 70 మంది సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వై.రామవరం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షతన శుక్రవారం సంపూర్ణ అభియాన్ అవగాహన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి, ఎంపీపీ కె.ఆనందరావు, జెడ్పీటీసీ కె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఏడాది క్రితం నీతిఆయోగ్ చేపట్టిన సర్వేలో వై.రామవరం, గంగవరం, మారేడుమిల్లి తదితర మండలాలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నట్టు చెప్పారు. అల్లూరి జిల్లాలో అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 6 నుంచి 30వ తేదీ వరకు మండలంలోని సమస్యలు, చేయాల్సిన అభివృద్ధిపై సర్వే నిర్వహిస్తారన్నారు. దీన్ని మండలప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అనంతరం అందరూ అభివృద్ధిలో పాలుపంచుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. నీతిఆయోగ్ నోడల్ అధికారి సూర్యతేజ, మండల కోఆర్డినేటర్ ఎప్సీబా వెనీలా, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బ లక్ష్మి, మండలంలోని సర్పంచ్‌లు, తహసీల్దార్ నాగరాజు, ఎమ్ఈఓ తాతబ్బాయిదొర, వ్యవసాయశాఖ ఏఓ ఉషారాణి, ఐసీడీఎస్ సీడీపీఓ, సుధారాణి, ఏపీఓ సాయిబాబ, ఏపీయం సుధాకర్, తదితర మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మధుసూధన రాజు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాల ఆమోదం తీరు సరైందికాదు

కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్



సింహగిరిపై మాడభూషి శ్రీధర్

సింహాచలం : కొత్తగా నేర చట్టాలను పార్లమెంట్‌లో ఆమోదించిన తీరు సరైంది కాదని, తీవ్ర విమర్శలకు గురైందని కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ పేర్కొన్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ) ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఏఏ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సుర్క్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్ఏ) అమల్లోకి వచ్చాయన్నారు. అయితే ఈ నేర చట్టాలను పార్లమెంట్‌లో ఆమోదించి తీరు తీవ్ర విమర్శలకు గురైందని గుర్తు చేశారు. గత ఏడాది డిసెంబర్‌లో ఆ చట్టాల తాలూకు బిల్లుల ఆమోదం సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభ నుంచి ఏకంగా 146మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారని, పార్లమెంట్ సభ్యులు చర్చ జరపకుండానే ప్రభుత్వం బిల్లులను ఏకపక్షంగా ఆమోదించిందని పిటీషనర్లు పేర్కొన్నారన్నారు. ప్రజల నుంచి కూడా ఈ కొత్త చట్టాలపై అభిప్రాయాలు సేకరించలేదన్నారు. జూలై 1 నుంచి జరిగే నేరాలను కొత్త చట్టాల ప్రకారం విచారించాల్సి ఉంటుందని, ఇది తీవ్ర గందరగోళానికి దారి తీసే ప్రమాదం ఉందన్నారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు.

అలాగే కేసుల నమోదు విషయంలో పోలీసులకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు కూడా ఉన్నాయన్నారు. నిందితులు వీడియో కాల్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరపవచ్చని కొత్త చట్టాలు చెబుతున్నాయని, కానీ దేశంలో 80శాతం కోర్టుల్లో దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలు లేవన్నారు. పాత, కొత్త చట్టాలకు సంబంధించిన కేసులు వాదించినపుడు ఎదురయ్యే ప్రాక్టికల్ సమస్యలు పరిష్కరించకుండా, చర్చలకు అవకాశం లేకుండా, కోర్టులలో మౌలిక సదుపాయాలు లేకుండా కొత్త చట్టాలు అమలు చేయడం సమంజసం కాదని తెలిపారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

రోలుగుంట: మినప, పెసర, బొబ్బర తదితర అపరాల పంటలకు పచ్చపురుగు తెగులు ఆశించి ఆకుల చుట్టూ రంధ్రాలు ఏర్పడడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దీనిపై వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి పలు సూచనలు చేశారు. నివారణకు గాను క్లోరోపైర్ పోస్ 2.5 ఎం.ఎల్‌ను లీటరు నీటిలో లేదా ఎస్పేట్ 1.5 గ్రాము లీటరు నీటిలో మిశ్రమం చేసి పిచికారీ చేసుకుని పంటలను సంరక్షించుకోవాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్ వద్ద శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. అతని వయసు 35 ఏళ్లు ఉంటాయని, 5.4 అడుగులు ఎత్తు, చామనచాయ రంగులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు కోరారు.